విద్యాదాత నడికట్టు రామిరెడ్డి

- తన సంపాదనలో కొంతభాగం విద్యాభివృద్ధికి కేటాయిస్తున్న వైనం
- చిరుమామిళ్ల విద్యాభివృద్ధిలో తనదైన ముద్ర

మనకు రెండు రకాల విద్య అవసరం. ఒకటి జీవనోపాధి ఎలా కల్పించుకోవాలో నేర్పేది. రెండవది ఎలా జీవించాలో నేర్పేది. 'ఓనమాలతో మొదలైన అక్షరాలు మనిషి జీవితాన్ని మార్చేసే గెలుపు మెట్లు అవుతాయి. అలా చదివిన చదువు చక్కని సంస్కారాన్ని నేర్పి విజ్ఞానాన్ని అందిస్తుంది. నలుగురిలో విలువ పెంచి వారి జీవితాలకు దారి చూపుతుంది. ఆఖరున ఓ గమ్యం ఏర్పరస్తుంది'.. ఈ మాటలే ఎప్పుడు పిల్లలను కలసినా విద్యాదాత నడికట్టు రామిరెడ్డి చెప్పే అమూల్యమైన మాటలు. సంపద కంటే చదువే గొప్పదని విద్యార్థులను కలసినప్పడల్లా సుద్దులు చెబుతుంటారు. ఎందుకంటే సంపదను మనం కాపాడుకోవాల్సి ఉంటుందని, అదే చదువు మనల్ని కాపాడుతుంటుందని ఆయన నమ్మిన సిద్ధాంతం. అలాంటి విద్యనభ్యసించే పేదవిద్యార్థులకు తనవంతు సాయంగా నిలబడి వారిని ముందుకు నడిపిస్తున్నారు ఆయన.

నాదెండ్ల: తన చిన్నతనంలో విద్యాభ్యాసం కోసం తాను పడ్డ కష్టాన్ని ప్రస్తుత తరం విద్యార్థులు పడకూడదనే గొప్ప ఉద్దేశంతో గ్రామంలో విద్యాభివృద్ధి, పాఠశాలల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు విద్యాదాత నడికట్టు రామిరెడ్డి. పేద ధనిక తారతమ్యాలు లేకుండా ప్రతి విద్యార్థికి నాణ్యమైన ఉచిత విద్య అందాలనే తలంపుతో తన సంపాదనలో కొంత భాగాన్ని విద్యాభివృద్ధి కోసం వెచ్చిస్తున్న ఆయన, తన స్వగ్రామం చిరుమామిళ్ళను విద్యారంగంలో ఉన్నతంగా నిలపాలని కృషి చేస్తున్నారు.

నాదెండ్ల మండలంలోని చిరుమామిళ్ళ గ్రామంలో కార్పొరేట్ స్థాయిలో ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల ఏర్పాటు, అభివృద్ధిలో రామిరెడ్డి పాత్ర విశేషమైంది. ఆయన చిన్నతనంలో సుమారు పది కిలోమీటర్లు కాలినడకన వెళ్ళి సంకురాత్రిపాడు గ్రామంలో విద్యాభ్యాసం చేశారు. ఉన్నత విద్య అనంతరం హైదరాబాద్‌కు వెళ్లి వ్యాపార రంగంలో మంచి విజయాలు సాధించారు. తాను పుట్టి పెరిగిన గ్రామానికి సేవ చేయాలనే సంకల్పంతో 2007లో సేవా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలో నాలుగు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఉండగా, వీటిలో వసతుల లేమి కారణంగా విద్యార్థులు ఇతర గ్రామాలకు వెళ్లి అక్కడి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుకునేవారు. ఈ విషయాన్ని గమనించిన రామిరెడ్డి ఎకరం భూమిని ప్రభుత్వానికి విరాళంగా అందించారు. ఆయన చొరవతో అప్పటి ప్రభుత్వం నాలుగు పాఠశాలలను విలీనం చేసింది. ప్రభుత్వ నిధులతో పాటూ రామిరెడ్డి సొంత నిధులతో పాఠశాల భవనాలు నిర్మించి శ్రీమతి కాసు రాఘవమ్మ, బ్రహ్మానందరెడ్డి ప్రాథమిక పాఠశాలగా నామకరణం చేశారు. రామిరెడ్డి తన స్వంత నిధులు రూ.40 లక్షలు వెచ్చించి తరగతి గదులు, ప్రహరీ, మౌలిక వసతులు కల్పించారు.


చిరుమామిళ్ళలోని శ్రీ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల


చిరుమామిళ్ళలోని కాసు రాఘవమ్మ, బ్రహ్మానందరెడ్డి ప్రాథమిక పాఠశాల

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి గ్రామస్తుల సహకారంతో 3 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. గుంటూరు జిల్లా పరిషత్ పాలకవర్గం అనుమతితో తన సొంత నిధులు రూ.1.40 కోట్లతో హైస్కూలు భవనాలు నిర్మించారు. ఈ హైస్కూలులో విశాలమైన క్రీడా ప్రాంగణం, తరగతి గదులు, డైనింగ్ హాలు, లైబ్రరీ, కంప్యూటర్ గది తదితరాలు ఏర్పాటు చేశారు. రామిరెడ్డి సేవలకు గుర్తింపుగా జెడ్పీ పాలక వర్గం ఉన్నత పాఠశాలకు శ్రీ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా నామకరణం చేశారు. గ్రామంలోని పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రభుత్వం అందించే విద్యాసామగ్రికి అదనంగా నోటుపుస్తకాలు, స్టడీ మెటీరియల్, అదనంగా రెండు యూనిఫాంలు, మధ్యాహ్న భోజనంలో అదనపు పౌష్టికాహారం అందిస్తున్నారు. లైబ్రరీకి కావలసిన పుస్తకాలు, క్రీడాసామగ్రి సమకూరుస్తున్నారు.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు

గ్రామంలోని శ్రీ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదోతరగతిలో ఉత్తమ ఫలితాలతో సత్తా చాటుతున్నారు. నూటికి నూరు శాతం ఉత్తీర్ణతతో జిల్లాలోనే పాఠశాలకు ప్రత్యేక స్థానం సాధించారు. విద్యార్థులను ప్రోత్సహించటం, విజేతలకు బహుమతులు అందించటం, వారిని ఉత్తేజితం చేయటంతో రామిరెడ్డి కృషి ఎంతో ఉంది. పదో తరగతి విద్యార్థులతో తరచూ సంభాషిస్తూ వారిని ఉత్తమ ఫలితాలు సాధించేలా పట్టుదలగా కృషి చేయించారనటంతో సందేహం లేదు.

21న పాఠశాలల వార్షికోత్సవం

గ్రామంలోని శ్రీ కాసు రాఘవమ్మ, బ్రహ్మానందరెడ్డి ప్రాథమిక పాఠశాల 91వ వార్షికోత్సవం, నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదహారో వార్షికోత్సవాలు ఈ నెల 21న నిర్వహించనున్నారు. నడికట్టు రామిరెడ్డి జన్మదినం సందర్భంగా ప్రతి ఏటా ఈ రెండు పాఠశాలల్లో వార్షికోత్సవాలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తున్నది. వార్షికోత్సవానికి జిల్లా ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించనున్నాయి.

విద్యా హబ్‌గా చిరుమామిళ్ల

ఒకప్పుడు మారుమూల గ్రామంగా మిగిలిపోయిన చిరుమామిళ్ళను విద్యా హబ్‌గా తీర్చిదిద్దడంలో రామిరెడ్డి విశేష కృషి చేశారు. 2013–14 విద్యా సంవత్సరంలో గ్రామంలో ఏపీ మోడల్ పాఠశాల ఏర్పాటు చేయించటంలో రామిరెడ్డి కీలక పాత్ర పోషించారు. అప్పటి ప్రభుత్వ పెద్దలు, విద్యాశాఖ ఉన్నతాధికారులను తరచూ కలుస్తూ వారిని ఒప్పించి పాఠశాల ఏర్పాటు చేయించారు. దీంతో ఆరో తరగతి నుంచి ఇంటర్ మీడియెట్, వృత్తి విద్యా కోర్సులు విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయి. గ్రామంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ పాఠశాలల్లో ఒక్క చిరుమామిళ్ళ విద్యార్థులే కాక ఇతర గ్రామాల నుంచి సైతం పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఇక్కడ విద్యాభ్యాసం చేస్తున్నారు. ఆయా విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుస్తున్నాయి.

ఉన్నత స్థానంలో నిలపాలన్నదే లక్ష్యం



విద్యతోనే మనిషి వ్యక్తిత్వం ఉన్నతంగా మారుతుంది. ఆర్థిక తారతమ్యాలకు అతీతంగా ప్రతి విద్యార్థికీ చక్కటి ఉన్నత విద్యాభ్యాసం అందితే దేశ భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుంది. నా చిన్నతనంలో చదువుకునేందుకు ఎంతో కష్టపడ్డా. వ్యాపార రంగంలో నిలదొక్కుకున్నాక నా గ్రామానికి సేవ చేయాలనుకున్నా. ముఖ్యంగా విద్యాభివృద్ధికి నా సంపాదనలో కొంతభాగం ఖర్చు చేస్తుంటా. ప్రతి ఏటా పదో తరగతిలో 500 మార్కులు పైగా సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నా. కులమతాలకతీతంగా ప్రతి విద్యార్థి చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నతంగా ఎదగాలనేదే నా ఆకాంక్ష.

–నడికట్టు రామిరెడ్డి, విద్యాదాత

క్లుప్తంగా

ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

వినుకొండ(నూజెండ్ల): ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. చాట్రగడ్డపాడు గ్రామంలో నక్కా గురువారెడ్డిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 10 లిక్కర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా కొత్తపాలెం గ్రామంలో ఒక మహిళను అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి 9 కింగ్ ఫిషర్ బీర్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ



నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిలకలూరిపేట లలితా ఆప్టికల్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆప్టికల్స్ అధినేత తాటి కృష్ణసందీప్ దృష్టిలోపాలున్న 32 మందికి కళ్లజోళ్లు అందించారు. ఆగష్టు మాసంలో పెదకాకాని శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు జరగ్గా దృష్టిలోపాలున్న 32 మందిని గుర్తించారు. వారికి కళ్లజోళ్లు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఐ కృష్ణానాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం కృష్ణసందీప్‌ను పాఠశాల ఉపాధ్యాయులు సత్కరించారు.

ఎన్‌సీడీ సర్వే పారదర్శకంగా చేయాలి

డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి



శావల్యాపురం: గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది ఎన్‌సీడీ సర్వే పారదర్శకంగా చేయాలని అలాగే దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులను నిరంతరం పర్యవేక్షణ చేయాలని జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో మక్కెన పద్మావతి అన్నారు. గురువారం మండలంలోని కనమర్లపూడి గ్రామంలో జరుగుతున్న ఎన్‌సీడీ 3.0 సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం గ్రామంలో సర్వే పరిస్థితి ఆన్‌లైన్ నమోదు పరిశీలించి వైద్య ఆరోగ్య సిబ్బందికి దిశ నిర్దేశం చేశారు. ఆమెతో పాటు ఆరోగ్య కార్యకర్త దాసరి రాజ్యలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ పృధ్వీరాణి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం బల్లికురవ మండలం ఉప్పుమాగులూరు గ్రామానికి చెందిన కొండూరి రాంబాబు ప్రతిరోజూ గణపవరంలోని ఓ కంపెనీలో పనిచేస్తుంటాడు. గురువారం ఉదయం తన ద్విచక్రవాహనంపై పనికి వెళ్తుండగా గణపవరం జాతీయ రహదారి దాటే క్రమంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. దీంతో రాంబాబు కుడికాలికి తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదంలో ద్విచక్ర వాహనం దెబ్బతింది. 108 సమాచారంతో బాధితుడిని చిలకలూరిపేట వైద్యశాలకు తరలించారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి



వినుకొండ(నూజెండ్ల): సీపీఎం ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహించిన ప్రజా పోరు ప్రచార యాత్రలో తెలియవచ్చిన ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ సురేష్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. నిత్యవసర ధరలను నియంత్రించాలని, 18 రకాల వస్తువులను చౌక దుకాణాల్లో ప్రభుత్వమే ప్రజలకు అందించాలని కోరారు. శివారు కాలనీలు, ఆయా గ్రామాల్లోని పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, కాలనీల్లో పారిశుధ్య పనులు చేయించాలని తదితర డిమాండ్‌లను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొంకూరి వెంకటేశ్వర్లు, కె.శివరామకృష్ణ, ఎస్‌కే రంజాన్‌బీ, పెనుమాల వెంకటేశ్వర్లు, ఆర్. ముని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి

నరసరావుపేట: సుమారు 40 కుటుంబాలు పేదవర్గాలు నివాసం ఉండే పట్టణం శివారు అశ్వకుల్లఖాన్ కాలనీలో రోడ్లు, సైడు డ్రెయిన్లు లాంటి మౌలిక వసతులు కల్పించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. గురువారం వారు కాలనీలో పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు దృష్టికి తీసుకెళ్లినా నేటికీ కాలనీవాసుల సమస్య పరిష్కారం కాలేదు అన్నారు.

ఎన్‌ఈసీలో ఉచిత డయాబెటిస్ పరీక్షలు



నరసరావుపేట రూరల్: నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత డయాబెటిస్ పరీక్షలు నిర్వహించారు. గుంటూరు కోనాక్ హస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థులు, అధ్యాపకులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కోనాక్ హాస్పటిల్ డయాబెటిస్ కౌన్సిలర్ డీటీ సాయిబాబా మాట్లాడుతూ బరువు తగ్గడం, కంటి చూపు మందగించడం, ఆకలి ఎక్కువగా ఉండటం, త్వరగా అలసిపోవడం డయాబెటిస్ వ్యాధి లక్షణాలు అని తెలిపారు. 18 సంవత్సరాలు పైబడిన వారిలో మన దేశంలో 77 మిలియన్ల మంది డయాబెటిస్‌తో బాధపడుతున్నారని వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమతుల్య ఆహారం తీసుకోవడం, ప్రతిరోజు వ్యాయమం చేయడం ద్వారా డయాబెటిస్‌ను నియంత్రించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కోనాక్ హాస్పటిల్ మేనేజర్ వంశీకృష్ణ, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగామ్ ఆఫీసర్ ఐ.శ్రీధర్ పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే అభివృద్ధి

డీపీఆర్‌సీ డీసీ పద్మ

యడ్లపాడు: పంచాయతీల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పంచాయతీల అభివృద్ధి సాధ్యం అవుతుందని గుంటూరు డీపీఆర్‌సీ డీసీ పద్మ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2025–26 ఒకరోజు శిక్షణ కార్యాక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీవో బి హేమలతాదేవి మాట్లాడు తూ ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన 17 లక్ష్యాలు, 9 థీమ్స్ గురించి అవగాహన అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా రీసోర్సు పర్సన్ అనురాధ గ్రామస్థాయిలో వివిధ డిపార్టుమెంట్లతో భాగస్వామ్యం కన్వర్జన్సీ ఫండ్స్, పంచాయతీ స్వంత ఆర్థిక వనరులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, సుస్థిర జీపీడీపీ–2025–26 తయారీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

యడ్లపాడు: బాలల దినోత్సవ వేడుకలు గురువారం మండలంలోని అన్ని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ముందుగా చాచా నెహ్రూ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వివిధ రకాల క్రీడలు, సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతుల్ని అందించి అభినందించారు. మైదవోలు ఎంపీపీఎస్ స్కూల్లో హెచ్‌ఎం జీవీ హేమలత ఆధ్వర్యంలో బాలికలకు స్కిప్పింగ్, రన్నింగ్, బాలురకు గన్నీబ్యాగ్స్ జంపింగ్, త్రోబాల్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో విజేతలకు గ్రామపెద్దలు నక్కా కోటేశ్వరరావు, పీఎం చైర్మన్ తిరుపతిరావు, ఉపాధ్యాయులు చేతుల మీదుగా బహుమతలు అందజేశారు. యడ్లపాడు నారాయణ ఇంగ్లీష్‌మీడియం స్కూలోల బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ చెరుకూరి సృజన ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఇటీవల కరాటే పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలతో అందరిని అలరించారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో స్కూల్‌డైరెక్టర్, కరస్పాండెంట్ పోపూరి వెంకటేశ్వర్లు, పోపూరి బ్రహ్మానందం, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కంభంపాడు లో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని గీతమ్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో చిల్డ్రన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో చూపరులను అలరించారు. ఈ సందర్భంగా గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి మాట్లాడుతూ నెహ్రూ జన్మదినం రోజున బాలల దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో..

చిలకలూరిపేట: బాలల దినోత్సవాన్ని గురు వారం ఘనంగా నిర్వహించారు. దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణంలోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మున్సిపల్ పాఠశాలలో స్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం పి శ్రీనివాసరావు మాట్లాడుతూ చాచా నెహ్రూ జీవిత విశేషాలను వివరించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సర్వశిక్ష అభియాన్ ఆదేశాల మేరకు విద్యార్థులతో బాలల దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. సెయింట్ చార్లెస్ హైస్కూల్‌లో స్కూల్ హెచ్‌ఎం సిస్టర్ మేరీ విమల, స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ సుందరీ ఉపాధ్యాయులు బ్రహ్మం, షేక్ జాఫర్, అంజయ్య, సుబ్బారావు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

శావల్యాపురం: స్థానిక భవిత సెంటరులో బాలల దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో మద్దికుంట సాంబశివరావు పాల్గొని చాచా నెహ్రు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళీ ఆర్పించారు. అనంతరం కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ స్కూలు ప్రధానోపాధ్యాయురాలు మాలతి, భవిత సెంటరు ఉపాధ్యాయులు కె.జగన్‌మోహన్‌రెడ్డి, ఎంఆర్‌సీ సిబ్బంది బోయపాటి తివిక్రమ్, లింగాల శ్రీహరి, సీఆర్‌పీలు రావూరి శివప్రసాదు, ఏలిక శ్రీనివాసరావు, ఏడుకొండలు, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

యడ్లపాడు: మండలంలోని కొండవీడు ఎంపీయూపీ పాఠశాలలో గురువారం బాలల దినోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. ముందుగా చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): బాలల దినోత్సవ వేడుకలను పట్టణం, వినుకొండ మండలంలోని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వెన్నపూస కాలనీలో గల గీతాంజలి రెసిడెన్షియల్ స్కూల్ నందు బాలల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తేళ్ల కృష్ణవేణి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, పిల్లలు భావి భారత పౌరులుగా ఎదిగి పుట్టిన గడ్డకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం చిన్నారులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ లక్ష్మణ్‌కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. నూజెండ్ల మండలంలోని కంభంపాడు జడ్పీహెచ్ పాఠశాల నందు బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో హెచ్‌ఎం వి.నరసింహారావు, ఉపాధ్యాయులు ఎల్.అంజిరెడ్డి, టి. శ్రీనివాసరావు, ఏఎస్ఎస్ సూర్యప్రకాశరావు, జి. చిన్నగోవిందు, ఎం. అన్నామణి, ఎ.బాజు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు గ్రంథాలయాలకు వచ్చేలా చూడాలి

- దేవదాయశాఖ విశ్రాంత కమిషనర్ పోపూరి గంగయ్యచౌదరి
- వేర్వేరు ప్రాంతాల్లో గ్రంథాలయ వారోత్సవాలు ఆరంభం

యడ్లపాడు: పిల్లలను గ్రంథాలయాలకు వచ్చేలా చూడాల్సిన బాధ్యత గురువులు, తల్లిదండ్రులదేనని దేవదాయశాఖ విశ్రాంత కమిషనర్ పోపూరి గంగయ్యచౌదరి చెప్పారు. యడ్లపాడు శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత తొలిప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినం రోజునే గ్రంథాలయ వారోత్సవాలు జరగడం అభినందనీయం అన్నారు. విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంపొందించే విషయంలో గ్రంథాలయాలు ముఖ్య పాత్రను పోషిస్తాయన్నారు. గ్రంథాలయ అధికారి చేవూరి అంజమ్మ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు మానుకొండ రామారావు, తాళ్లూరి నాగేశ్వరరావు, నాదెండ్ల వెంకట్రావు, షేక్ అల్లాబక్షు, నన్నే సాహెబ్, మత్తయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

బొల్లాపల్లి: మండల కేంద్రంలోని శాఖాగ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. బాలల దినోత్సవం సందర్భంగా జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ పుస్తకాలు విజ్ఞాన నేస్తాలని, పుస్తక పఠనం చేయడం ద్వారా జ్ఞానం పెరుగుతుందన్నారు. గ్రంథాలయంలోని పుస్తకాలను సద్వినియోగించుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.ఖలీల్, సీఆర్‌పీ ఖాశీంవలి, గ్రామపెద్దలు లక్ష్మీరెడ్డి, వెంకటేశ్వర్లు, గ్రంథాలయ అధికారి రమావత్ సేవనాయక్ తదితరులు పాల్గొన్నారు.


చిలకలూరిపేటలో బహుమతులు అందుకున్న విద్యార్థులతో అతిథులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వినుకొండ శాఖ గ్రంథాలయ 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ ఎస్.సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ గ్రంథాలయాలను వినియోగించుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. త్వరలో స్థల సేకరణ చేసి నూతన గ్రంథాలయాన్ని నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో జాన్ సుందర రావు, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు కమలారాం, రిటైర్డ్ హెచ్‌ఎం రవికుమార్, ఇంచార్జి గ్రంథాలయ అధికారి భూక్యా బద్రి నాయక్ , విద్యార్థులు పాల్గొన్నారు.

నాదెండ్ల: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విద్యార్థులు, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో స్వరూపారాణి చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి.

చిలకలూరిపేట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. స్థానిక వార్డు కౌన్సిలర్ కొత్త కుమారి ఈ వారోత్సవాలను ప్రారంభించారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు దేశభక్తి గేయాలు, శతక పద్యాల పోటీలు నిర్వహించారు. జూనియర్స్ విభాగంలో విచిత్ర వేషధారణ పోటీలు నిర్వహించారు.

శ్రీరామా పబ్లిక్ స్కూల్లో

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో శ్రీరామా పబ్లిక్ స్కూల్లో బాలల దినోత్సవం కార్యక్రమం వేడుకలు గురువారం నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కె.రత్నకుమారి తెలిపారు. తొలుత నెహ్రు చిత్రపటానికి పూల మాలల వేసి ఘన నివాళీ ఆర్పించారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కె.వి.ఆర్. మోహన్‌చందు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదవాలని రేపటి సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. జవహర్ నెహ్రు మొదట ప్రధానమంత్రిగా భారతదేశానికి చేసిన సేవలు కొనియాడారు. అనంతరం వ్యాసరచన, డిబేటింగ్, క్విజ్, ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. డైరెక్టరు అజిత్‌చంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని దేవాలయంగా భావించాలి

మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులు గ్రంథాలయాన్ని దేవాలయంగా భావించి తరచూ సందర్శించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు తెలిపారు. పల్నాడు రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రంథాలయాధికారిణి యడ్లపాటి రాధ అధ్యక్షత వహించిన ప్రారంభ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కమిషనర్ జస్వంతరావు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. సభలో శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పి.వి.ఎస్.ఆర్. ప్రసాదరావు, అభ్యుదయ భారతి అధ్యక్షుడు రత్నాకరం రాము, రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, పద్యకవి ఈవూరి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు మన గ్రంథాలయం అనే అంశంపై చిత్రలేఖనం పోటీ నిర్వహించారు. తొలుత బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, గ్రంథాలయోద్యమ నేత అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అండగా నిలిచిన హోంగార్డులు అభినందనీయులు

- హోంగార్డు భార్యకు రూ.5లక్షల చెక్ అందజేత
- జిల్లా కార్యాలయంలో అందజేసిన ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు కుటుంబానికి తోటి హోంగార్డులు ఒకరోజు జీతం సహాయంగా అందజేశారని, వారందరూ అభినందనీయులని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో హోంగార్డు పి.శరత్‌బాబు భార్య పి.ఝాన్సీకి రూ.5లక్షల విలువైన చెక్‌ను అందజేశారు. శరత్‌బాబు 6వ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తూ కిడ్నీ ఫెయిల్యూర్ సమస్యతో ఆరోగ్యం క్షీణించి చికిత్స పొందుతూ మృతిచెందాడు. అందుకు అతని కుటుంబానికి హోం గార్డులు అందరూ వారి ఒక రోజు వేతనం మొత్తం రూ.5లక్షలు సాయం చేశారని ఎస్పీ పేర్కొన్నారు. హోంగార్డు ఆర్.ఐ యస్.కృష్ణ పాల్గొన్నారు.


హోంగార్డు భార్యకు చెక్ అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ప్రజలను భాగస్వామ్యం చేయాలి

బొల్లాపల్లి: గ్రామపంచాయతీల అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయాలని ఎంపీపీ బత్తి రాములు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 2వ రోజు గ్రామపంచాయతీల అభివృద్ధి, మండల అభివృద్ధి ప్రణాళికపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కె.ప్రభాకర్, మండల స్థాయి అధికారులు, గ్రామసమైక్య సంఘాల అధ్యక్షులు, డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

సీపీఎం ధర్నా

రొంపిచర్ల: ప్రజా సమస్యల పరిష్కారమే అంజెండాగా ఎర్రజెండా ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని సీపీఎం రొంపిచర్ల మండల కన్వీనర్ ఎస్. వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. వెంకటేశ్వరరాజు మాట్లాడుతూ నవంబర్ 8వ తేదీ నుండి 13వ తేదీ వరకు ప్రజా పోరు ప్రచార యాత్రలో భాగంగా ప్రజలు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలపై గళమెత్తారు. వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు.